'నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి'


మున్సిపల్ కార్మికులపై దాడి చేస్తున్న వ్యక్తులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో శుక్రవారం మున్సిపల్ కార్మికులపై దాడి చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ మున్సిపల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. సులేమాన్‌నగర్ డివిజన్ పరిధిలోని మెయిన్ రోడ్డుపై పిల్లర్ నంబర్ 207 వద్ద ఫుట్‌పాత్‌పై అక్రమంగా కొందరు వ్యక్తులు వ్యాపారం చేస్తున్నారని వాటిని తొలగించాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కమిషనర్‌కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు వచ్చిందన్నారు. దీంతో రాజేంద్రనగర్ మున్సిపల్ టౌన్ ప్లానింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వాటిని తొలగించాలని కార్మికులకు ఆదేశాలు ఇచ్చారన్నారు. అక్కడికి వెళ్లిన కార్మికులు కొబ్బరిబొండాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ బండిలో వేస్తుంటే అక్కడే వ్యాపారం చేస్తున్న ముగ్గురు వ్యక్తులు వచ్చి కార్మికులపై రాళ్లు, కట్టెలు, కొబ్బరిబొండాలను తీసుకొని దాడి చేశారని ఆరోపించారు. దాడిపై రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని లేకుంటే ఏఐటీయూసీ మున్సిపల్ సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు, పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే




గండిపేట మండలపరిధిలో శుక్రవారం గుడ్‌ఫ్రైడేను క్రిస్టియన్లు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచే మణికొండ, పుప్పాలగూడ, నార్సింగి, మంచిరేవుల, కోకాపేట తదితర గ్రామాల్లోని చర్చిల్లో ప్రార్థనలు చేశారు. మణికొండలోని ది లైఫ్ చర్చికి క్రైస్తవులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా ఫాస్టర్లు ఏసుక్రీస్తు ఇతివృత్తాన్ని వివరించారు. -మణికొండ

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మణికొండ: నార్సింగి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 30న (నేడు) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సందీప్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫీడర్ మరమ్మతుల కారణంగా నార్సింగి గ్రామం, సజ్జన్‌సింగ్ లేఅవుట్, చక్యాబా మజీద్ కాలనీ, నార్సింగి హైట్స్, సీవీఆర్ హోటల్, వివేకానంద నగర్, నార్సింగి మార్కెట్, నార్సింగి పోలీస్‌స్టేషన్, ఓం కన్వెన్షన్, బాలాజీనగర్, రుక్మొద్దీన్ కాలనీల్లో ఉదయం 6 నుంచి 6.30 గంటల వరకు సరఫరాను నిలిపేస్తామని పేర్కొన్నారు. అలాగే రాందేవ్‌గూడ, వెసెల్లా విల్లాస్, తారామతి, వన్‌మోర్‌నగర్, నెక్నాంపూర్ గ్రామం, ఫోటిల్లా అపార్ట్‌మెంట్స్, ఈవీవీ కాలనీ, ఫెయిర్‌ఫీల్డ్ కాలనీ, మార్వా టౌన్‌షిప్, ఖాస్వా ఎన్‌క్లేవ్, డ్యూస్ విల్లాస్, రాయల్ ఫంక్షన్‌హాల్, ఆనంద బేహిల్స్, ఆనంద పోయెట్రీ, అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నంబర్ 28 నుంచి 30 వరకు ఉదయం 7 నుంచి 7.30 గంటల వరకు సరఫరా ఉండదని తెలిపారు. ఇబ్రహీంబాగ్ గ్రామం, వాసవి కాలేజీ, వైఎస్సార్ కాలనీ, కోహినూర్ ఎన్‌క్లేవ్, పాషాకాలనీ, వెంకటేశ్వరకాలనీ, ఈవీవీ కాలనీ, కేజీఎన్ జిరాక్స్ రోడ్డులో ఉదయం 8 నుంచి 8.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

మణికొండ, పుప్పాలగూడ, కోకాపేట పరిధిలో..

మణికొండ: మణికొండ, పుప్పాలగూడ, కోకాపేట విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఈనెల 30న (నేడు) విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ జ్ఞానేశ్వర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 నుంచి 6.30 గంటల వరకు కోకాపేట 250 గజాల కాలనీలో, మణికొండ సెక్రటేరియట్ కాలనీలో 6.30 నుంచి 7.30 గంటల వరకు, నెక్నాంపూర్ గ్రామంలో 7 నుంచి 7.30 గంటల వరకు, అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నంబర్ 1 నుంచి 13 వరకు 7 నుంచి 8 గంటల వరకు, చింతచెట్టు చౌరస్తా నుంచి అలిజాపూర్ వరకు 8 నుంచి 8.30 గంటల వరకు, హనుమాన్‌నగర్ నుంచి శివపురికాలనీ, ఫ్లెజెంట్ వ్యాలీ కాలనీ, శ్రీనివాస్‌నగర్ కాలనీ, పంచవటి కాలనీల్లో 8.30 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

హిమాయత్‌సాగర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

బండ్లగూడ: హిమాయత్‌సాగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్నేహితహిల్స్ ఫీడర్‌లో ఉదయం 7 నుంచి 7.30 గంటల వరకు స్నేహిత హిల్స్, పీరంచెరువు గ్రామం, వాసంతీఆనందీ, భాగ్యనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 7.30 నుంచి 8 గంటల వరకు రఘురామ్ కాలనీ, ఇంద్రారెడ్డినగర్, పావనీపేటల్స్, రాధానగర్, సన్‌సిటీ ఫీడర్ పరిధిలో ఉదయం 6 నుంచి 6.30 గంటల వరకు వెస్టెండ్ కాలనీ, హైదర్షాకోట్, లక్ష్మీనగర్, హిమగిరి కాలనీ, శాంతి నగర్ తదితర ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు


కొత్తగూడ ఫ్లైఓవర్, రోడ్లను పరిశీలిస్తున్న సీపీ అవినాష్‌మహంతి

రాయదుర్గం: ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు, అన్ని మార్గాల నుంచి కొత్తగూడ ఫ్లైఓవర్‌పై రాకపోకలకు ఏర్పాట్లు చేశారు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు. సైబరాబాద్ సీపీ అవినాష్‌మహంతి ఆదేశాలపై సోమవారం నుంచి శుక్రవారం వరకు హఫీజ్‌పేట్ నుంచి గచ్చిబౌలి వైపు వెళ్ళే వారు కొత్తగూడ ఫ్లైఓవర్‌పై నుంచి వెళ్ళడానికి ఏర్పాట్లు చేశారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అనుమతి. కొత్తగూడ ఫ్లైఓవర్, పరిసరాల రోడ్లను సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, డీసీపీ మాదాపూర్ ట్రాఫిక్ డివి శ్రీనివాసరావు, అదనపు డీసీపీ ట్రాఫిక్ కె శివకుమార్, ఏసీపీ కె సత్యనారాయణ, ఎస్‌హెచ్‌ఓఎస్ రాజశేఖర్‌రెడ్డి, అదనపు ఇన్‌స్పెక్టర్ ఎస్ వెంకటరమణ, ఆర్.ఐ. ఎస్‌సీఎస్‌సీ బృందంతో కలిసి శుక్రవారం పరిశీలించారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ రద్దీ ఉండే ఏరియాల గురించి సీపీ ఆరా తీశారు. తగిన చర్యలు తీసుకోవాలని సీపీ అధికారులను ఆదేశించారు. సోమవారం నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు ఫ్లైఓవర్‌పై రాకపోకలకు హఫీజ్‌పేట్ నుంచి గచ్చిబౌలి నుంచి వెళ్ళేవారిని అనుమతించాలని నిర్ణయించినట్లు ట్రాఫిక్ అధికారులు వివరించారు.

రేపు రాజేంద్రనగర్ కార్యకర్తల సమావేశం

రాజేంద్రనగర్: ఉప్పర్‌పల్లిలోని పీఆర్ ప్యాలెస్‌లో ఈ నెల 31వ తేదీన ఉదయం 10 గంటలకు రాజేంద్రనగర్ అసెంబ్లీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు కో-కన్వీనర్ బుర్ర మహాలింగం గౌడ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీ కన్వీనర్ పొన్నామోని మల్లేశ్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగే సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహా రెడ్డి, మాజీ ఎంపీ, చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. బూత్ కమిటీ సభ్యులు, మండల, డివిజన్, మున్సిపాలిటీ, కార్పొరేషన్లు, మోర్చాల కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

నేడు సమావేశం

రాజేంద్రనగర్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఈ నెల 30వ తేదీన (నేడు) సమావేశాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శివరాంపల్లిలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల మైదానంలో సాయంత్రం 7.30 గంటలకు జరిగే మీటింగ్‌కు రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, లక్ష్మీగూడ నగర్‌ల స్వయం సేవకులు, హిందూ బాంధవులు రాజకీయ పార్టీలు, సంస్థలకు అతీతంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ద్విచక్ర వాహనాల విడిభాగాలను అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

గన్‌ఫౌండ్రీ: ద్విచక్ర వాహనాల విడిభాగాలను దొంగతనంగా అమ్ముతున్న ఓ వ్యక్తిని శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. కింగ్‌కోఠి ప్రాంతానికి చెందిన అక్బరుద్దీన్(34) లైట్ మిషన్ వర్క్ చేస్తుంటాడు. అక్రమ మార్గంలో సంపాదించాలనే దురాచనలతో ద్విచక్ర వాహనాల విడిభాగాలను విడదీసి విక్రయించడం, పత్రాలు లేని వాహనాలను కొనుగోలు చేయడం వంటి అక్రమ మార్గాన్ని ఎంచుకున్నాడు. పలువురు బాధితులు తెలిపిన వివరల ప్రకారం.. పోలీసులు తన షాపుపై దాడులు నిర్వహించారు. అతని వద్ద నుంచి 7 ద్విచక్ర వాహనాలు, 40 ఆల్వాటికల్ ఐరన్ బిట్స్, 9 సంఖ్యాపరమైన ఐరెన్ బిట్స్, ఒక కట్టింగ్ మిషన్‌లతో కూడిన వస్తువులను స్వాధీనం చేసుకున్నామని వీటి విలువ మొత్తం రూ.3 లక్షల వరకు ఉంటుందని తెలపారు. తుదిపరి విచారణకై నిందితుడిని అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భారతదేశంలో యువశక్తికి కొదువ లేదు


హెచ్‌సీయూలో 64వ ఐఎస్‌ఎల్‌ఈ సదస్సులో సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

- ఐఎల్‌ఓ డీసెంట్ వర్క్ టీమ్ సౌత్ ఏషియా, ఇండియా డిప్యూటీ డైరెక్టర్ సంతోషి
- 64 ఇండియన్ సొసైటీ ఆఫ్ లేబర్ ఎకనామిక్స్ (ఐఎస్‌ఎల్‌ఈ) సదస్సు ప్రారంభం

రాయదుర్గం: భారతదేశంలో యువ శక్తికి కొదవ లేదని ఐఎల్‌ఓ డీసెంట్ వర్క్ టీమ్ సౌత్ ఏషియా, ఇండియా డిప్యూటీ డైరెక్టర్ సంతోషి ససాకి పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో 64 ఇండియన్ సొసైటీ ఆఫ్ లేబర్ ఎకనామిక్స్ (ఐఎస్‌ఎల్‌ఈ) సదస్సు ప్రారంభ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువశక్తిని వినియోగించుకోవడానికి వారికి చదువుతోపాటు తగిన నైపుణ్యం కలిగి ఉండేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా శక్తికి కూడా భారత్‌లో కొదువ లేదని, వారికి తగిన రక్షణ ఏర్పాట్లు చేస్తే వారి పనితీరు ఎంతో మెరుగ్గా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం ఆర్‌బీఐ డీఈపీఆర్ ప్రిన్సిపల్ అడ్వైజర్ డాక్టర్ దేబాప్రసాద్‌రత్, హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు, ఐఎస్‌ఎల్‌ఈ అధ్యక్షుడు ప్రొఫెసర్ దీపక్ నయ్యర్, ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ బద్రినారాయణ రథ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీలు ప్రొఫెసర్ అలోక్‌ఎన్ శర్మ, ప్రొఫెసర్ అలోక్‌కుమార్ మిశ్రా, సదస్సు అధ్యక్షులు రితు దీవాన్‌లు భారత దేశ ఆర్థిక విధానం, సెల్ఫ్‌ఎంప్లాయిమెంట్, కొవిడ్ తర్వాత ఆర్థిక పరిస్థితి, కార్మిక విధానాలు వంటి అంశాలపై ప్రసంగించారు.అనంతరం 64వ ఐఎస్‌ఎల్‌ఈ సదస్సు సావనీర్‌ను ఆవిష్కరించారు.

ట్రిపుల్ ఐటీ హైదరాబాద్- ప్లాక్ష యూనివర్సిటీ ఒప్పందం


ప్రొ. పీజేనారాయణన్, ప్లాక్షా వైస్‌చాన్స్‌లర్ ప్రొ.రుద్ర ప్రతాప్ సంతకాలు చేస్తున్న దృశ్యం

- 'సుస్థిరత' కోసం 'ఉమ్మడి కేంద్రం' ఏర్పాటుకు నిర్ణయం
- ఒప్పందంపై సంతకాలు చేసిన ఇరు సంస్థల ప్రతినిధులు

రాయదుర్గం: 'సుస్థిరత' కోసం 'ఉమ్మడి కేంద్రం' (సస్టేనబుల్ సెంటర్) ఏర్పాటు చేయాలని గచ్చిబౌలి ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్, ప్లాక్ష యూనివర్శిటీ సమిష్టిగా నిర్ణయించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం రెండు సంస్థల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పంద పత్రాలపై ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ పీజే నారాయణన్, ప్లాక్ష యూనివర్శిటీ వ్యవస్థాపక వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ రుద్ర ప్రతాప్ సంతకాలు చేశారు. ఈ సెంటర్ ప్రాథమికంగా గ్రామాలు, పట్టణాల చుట్టూ ఉన్న పిరమిడ్ వినియోగ కేసుల పరిశోధనపై దృష్టి పెడుతుంది. ఇది గాలి, కాలుష్యం, నీరు, నెట్‌వర్క్‌లు, డబ్ల్యూటీపీ, ఎస్‌టీపీ, వర్షం, శక్తి, స్మార్ట్ మీటర్లు, పంపిణీ, గ్రిడ్‌లు, నిల్వ, వ్యర్థాల నిర్వహణ ఘననీరు, ఇతరత్రా వాటితోపాటు ఆహారం/వ్యవసాయం వంటి ఫంక్షనల్ డొమైన్‌లలో సమస్యలను తీసుకుంటుంది.

ఉమ్మడి నిర్ణయాలు అమలు చేస్తాం

ఈ కేంద్రం ప్రభావవంతమైన పరిశోధన, విద్యా కార్యక్రమాలు, సమాజ ప్రమేయంపై పనిచేస్తుందన్నారు. మా మధ్య బంధం మరింత పెంచేందుకు ఈ ఒప్పందం ఎంతో దోహదం చేస్తుందన్నారు.ప్లాక్ష యూనివర్శిటీ వ్యవస్థాపక వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ రుద్ర ప్రతాప్ మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని ఆకాంక్షిస్తున్నానన్నారు.

70 శాతం మహిళలకు ఐరన్ లోపంతో సమస్యలు


మాట్లాడుతున్న డాక్టర్ నర్మద

గన్‌ఫౌండ్రీ: దేశ వ్యాప్తంగా 70 శాతం మహిళలు ఐరన్, క్యాల్షియం లోపంతో బాధపడుతున్నారని ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ హెచ్.నర్మద ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం నిజాం కళాశాలలో కళాశాల మహిళా సాధికారత సెల్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐరన్, క్యాల్షియం లోపాలు అనే అంశంపైసదస్సునిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఇటీవల గ్రామాల్లో జరిపిన ఓ అధ్యాయనం ప్రకారం ..40 ఏళ్ల వయస్సు కలిగిన మహిళలు 80 ఏళ్ల వయస్సు ఉన్నట్లుగా కన్పిస్తున్నారన్నారు. ఇందుకు గల ప్రధాన కారణం ఐరన్, క్యాల్షియం విటమిన్ లోపమేనని తెలిపారు. ఈ లోపాల వల్ల మహిళలు రక్తహీనత, ఎముకల బలహీనత వంటి రోగాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు ప్రభుత్వ న్యాయవాది షాజీరా పర్వీన్, విశ్రాంత ప్రిన్సిపల్ జడ్జి ఉదయ గౌరి, నోవా స్పేస్ డైరెక్టర్ ఇంజనీర్ వి.చెన్నకేశ్వరీ, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ భీమా, మహిళా సాధికారత కో ఆర్డినేటర్ ఎస్.స్రవంతి, వైస్ ప్రిన్సిపాల్ ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్క్రాప్ దుకాణంలో భారీ అగ్నిప్రమాదం



శంషాబాద్: పట్టణంలోని రాళ్లగూడ రహదారిలో గల స్క్రాప్ దుకాణంలో శుక్రవారం ఉదయం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఉదయం 9 గంటల ప్రాంతంలో షార్ట్‌సర్క్యూట్‌తో షాపులోని పేపర్లు, ప్లాస్టిక్ ఇతర వ్యర్థాలకు మంటలు వ్యాపించాయి. వెనుక భాగంలో పెద్ద ఎత్తున నిల్వ చేసిన పేపర్లు, ప్లాస్టిక్ బ్యాగులు, ఇతర వ్యర్థపదార్థాలను కూడా అంటుకున్నాయి. దీంతో స్థానికులు ఫైర్‌సిబ్బందికి సమాచారం అందించారు. పక్కనే గ్యాస్ ఏజెన్సీ ఉండడంతో సిబ్బంది వెంటనే సిలిండర్లను బయటకు తీసుకెళ్లారు. మూడు ఫైరింజన్ల సాయంతో రెండు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమిటీ నియామకం

- డివిజన్ల వారీగా కోర్ కమిటీలు
- బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న సామ రంగారెడ్డి

రాయదుర్గం: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డివిజన్ల వారీగా కోర్ కమిటీలను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. పార్టీని పటిష్టం చేయడంలో అందరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ప్రతి ఒక్కరూ కష్టపడితేనే చేవెళ్ళ పార్లమెంటు అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విజయం సాధిస్తారని అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ బీజేపీని శేరిలింగంపల్లిలో మరింత పటిష్టం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం ప్రభారి శ్రీనివాస్, కన్వీనర్ రాఘవేంద్రరావు, కార్యవర్గ సభ్యుడు రవీందర్‌రావు, నరేష్, బీజేపీ, బీజేవైఎం, మహిళామోర్చా, ఇతర అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'రంజాన్ మాసంలో ప్రతి శుక్రవారం పవిత్రమైంది'


అక్తరీ మసీదులో మాట్లాడుతున్న సయ్యద్ మతీన్ అలీషా ఖాద్రీ

గోల్కొండ: రంజాన్ మాసంలో ప్రతి శుక్రవారం ఎంతో పవిత్రమైందని అఖిల భారత ఖీరత్ కమిటీ అధ్యక్షుడు మౌలానా కారీ సయ్యద్ మతీన్‌అలీషా ఖాద్రీ అన్నారు. శుక్రవారం గోల్కొండ దిలావర్‌షా మసీదులోని అక్తరీ మసీదులో రంజాన్ మాసం శుక్రవారంపై జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శుక్రవారం ఈదుల్ మోమీనిన్ అని పిలుస్తారన్నారు. రంజాన్ మాసంలో వచ్చే శుక్రవారాలకు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయని పేర్కొన్నారు. రంజాన్ మాసం శుక్రవారాలకు హాజరైయ్యే వారికి అల్లా కరుణిస్తాడని ప్రార్థనలు చేసే వారికి సుఖసంతోషాలతో పాటు ఆరోగ్యం, వ్యక్తిగత జీవితంలో సమస్యలు దూరం అవుతాయన్నారు. టెర్రరిస్ట్ కార్యకలాపాలకు ఇస్లాం మతంలో తావులేదని ప్రవక్త మహ్మద్ జీవితం దీనికి నిదర్శనమని ఆయన అన్నారు. దేశం కోసం ఎన్ని త్యాగాలకైనా సిద్ధపడే వారే నిజమైన దేశభక్తులని ఆయన పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బాల పోచయ్య


కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న బాల పోచయ్య

రాజేంద్రనగర్: బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బాల పోచయ్య శుక్రవారం పార్టీకి రాజీనామా చేశారు. అనంతరం తన అనుచరులతో కలిసి గాంధీభవన్‌కు వెళ్లి రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి దీప్‌దాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతో పాటు డాక్టర్ సంజయ్, సునీల్ తదితరులు కూడా చేరారు.

తూకం.. మోసం

- పట్టించుకోని తూనికలు కొలతల శాఖాధికారులు
- మామిడి పండ్ల సీజన్ కావడంతో మోసానికి పాల్పడుతున్న కొందరు వ్యాపారులు


మామిడి పండ్లు ఖరీదు చేస్తున్న వినియోగదారుడు

చార్మినార్: పాతబస్తీలో పండ్ల వ్యాపారులు తూకంలో మోసాలకు పాల్పడుతున్నారు. తూనికలు, కొలతల శాఖ అధికారులు..తూకాల్లో మోసాలు జరుగుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదు. దీంతో వినియోగదారులు తూకాల్లో పెద్ద ఎత్తున మోసాలకు గురవుతున్నారు. పాతబస్తీలోని కిరాణా దుకాణాలు, షాపింగ్ మాల్‌లతో పాటు స్క్రాప్ దుకాణాలు..ఇలా ప్రతి దాంట్లో కచ్చితమైన తూకాలు జరగడం లేదు. ఏడాదికోసారి కూడా జిల్లా తూనికలు, కొలతలు శాఖ అధికారులు, సిబ్బంది పాతబస్తీలో తనిఖీలు నిర్వహించడం లేదు. పాతబస్తీ వైపు కన్నెత్తి చూడకపోవడంతో తూకాల్లో మోసాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. కొంత మంది నిజాయితీగా తమ వ్యాపారాలను కొనసాగిస్తుండగా..అక్రమ సంపాదనే ధ్యేయంగా మరికొంత మంది తక్కువ బరువులతో వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. పౌర సరఫరాల శాఖ అధికారులు, తూనికలు, కొలతల శాఖ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించాల్సి ఉండగా..ఆ దిశలో స్పందించడం లేదనే ఫిర్యాదులు ఉన్నాయి. రెండు శాఖల నడుమ సమన్వయ లోపం కారణంగా వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. నిత్యవసర వస్తువులతో పాటు కూరగాయలు, పండ్లు, పెట్రోల్ బంకుల్లో సైతం తూకాల్లో వ్యత్యాసం కనబడుతుందని వినియోగదారులు లబోదిబోమంటున్నా..పట్టించుకునే వారు కరువయ్యారు.

పాతబస్తీలో కనిపించని తనిఖీలు..

ప్రతి ఏడాది ఆయా వ్యాపార సంస్థలు, వ్యాపారస్తులు సంబంధిత జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారులతో గుర్తింపు పొందిన బరువుల (వెయిట్స్)ను వినియోగించాలి. కిలో, రెండు కిలోలు..ఇలా ఏ బరువులైతే వినియోగిస్తారో ఆయా బరువులు సంబంధిత తూనికలు, కొలతలు శాఖ (వెయిట్స్ అండ్ మెజర్‌మెంట్స్) అధికారులతో గుర్తింపు పొందాల్సి ఉంటుంది. అయితే పాతబస్తీలోని చాలా మంది వ్యాపారులు ఎలాంటి గుర్తింపు లేని బరువులను మాత్రమే వినియోగిస్తున్నారు. ప్రస్తుతం కొంత మంది వినియోగిస్తున్న బరువుల్లో చాలా వరకు తేడాలు కనిపిస్తున్నాయి. కిలో బరువుతో ఏదైన వస్తువు ఖరీదు చేస్తే..వినియోగదారునికి అందులో 50-100 గ్రాములు తరుగు వస్తుంది. ఖరీదు చేసిన వస్తువులను మరోచోట మళ్లీ తూకం వేయించుకునే సౌకర్యాలు అందుబాటులో లేకపోవడంతో వ్యాపారస్తుల మోసాలకు అడ్డూ అదుపు లేకుండా పోతుంది.

మామిడి పండ్ల సీజన్‌లో..

ప్రస్తుతం మామిడి పండ్ల సీజన్ కావడంతో పాతబస్తీలోని కొన్ని ప్రాంతాల్లో తక్కువ తూకంతో వ్యాపారాలు కొనసాగుతున్నాయి. కొంత మంది వ్యాపారులు ఉద్దేశపూర్వకంగా తూకంలో మోసం చేస్తున్నారు. రెండు కిలోల మామిడి పండ్లు ఖరీదు చేస్తే..అందులో పావుకిలో తక్కువగా వస్తున్నట్లు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది సరైన తూకంతో వినియోగదారులను ఆకట్టుకుంటుండగా..మరికొంత మంది మోసాలకు పాల్పడుతున్నారు. వీరిని కట్టడి చేయాల్సిన అవసరముందని వినియోగదారులు కోరుతున్నారు. వీరు వినియోగించే బరువులు సంబంధిత అధికారుల నుంచి గుర్తింపు పొందినవి కాకపోవడంతో మోసాలు జరుగుతున్నాయి.

ఏప్రిల్ 1న నూతన కార్యవర్గ ఆత్మీయ సమావేశం

నాంపల్లి: తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్ అధ్యక్షతన నూతనంగా ఎన్నికైన నూతన కార్యవర్గం ఆత్మీయ సమావేశాన్ని ఏప్రిల్ 1న నాంపల్లి గృహకల్ప భవన సముదాయంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ తెలియజేశారు. శుక్రవారం ఆయన నాంపల్లిలో విలేకర్లతో మాట్లాడారు. ముఖ్యఅతిథులుగా టీఎన్జీఓ కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీష్, సహాధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, టీజీఓ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏనుగు సత్యనారాయణ, రాష్ట్ర సహాధ్యక్షులు బి.శ్యామ్ హాజరవుతున్నట్లు తెలిపారు. తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘానికి వరుసగా ఆరు పర్యాయాలు అధ్యక్షుడిగా ఎన్నికైన గడ్డం జ్ఞానేశ్వర్‌ను ఈ సందర్భంగా సత్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి 33 జిల్లాలకు చెందిన తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగులు హాజరవుతున్నట్లు తెలిపారు.

'నగరంలోకి పొరుగు జిల్లాల ఆటోలను అనుమతించొద్దు'


మాట్లాడుతున్న మహ్మద్ అమానుల్లాఖాన్

సుల్తాన్‌బజార్: నగరంలోకి పొరుగు జిల్లాల ఆటోలను అనుమతించకుండా నగర పోలీస్ కమిషనర్, ఆర్‌టీఏ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఆటో డ్రైవర్ల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మహ్మద్ అమానుల్లా ఖాన్ అన్నారు. శుక్రవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. పొరుగు జిల్లాల్లో రిజిస్టరైన వేలాది ఆటోలు నగరంలోకి రావడంతో ఇక్కడి ఆటో డ్రైవర్లకు గిరాకీ లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా వేల సంఖ్యల్లో పొరుగు జిల్లాల ఆటోలు ప్రవేశించడంతో కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్నాయని ఆరోపించారు. ఓలా, ఊబెర్, ర్యాపిడో, క్యాబ్‌ల యాజమాన్యాలు చేసే దోపిడీని అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆటో జేఏసీ నాయకులు కె.లక్ష్మీనర్సయ్య, ఎస్‌కే జామా, మహ్మద్ అజీమొద్దీన్, షేక్ రహీం పాల్గొన్నారు.

వారం పాటు ఉచిత వైద్యశిబిరం

రాయదుర్గం: మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏహెచ్‌ఏ క్లినిక్స్ పర్యవేక్షణలో ఏప్రిల్ 1వ తేదీ నుంచి 6వ తేదీ వరకు న్యూరో అండ్ జనరల్ మెడిసిన్‌పై ఉచిత వైద్య శిబిరం జరగనుంది. టెలికామ్ నగర్ ప్రధాన రోడ్డులోని ఏహెచ్‌ఏ క్లినిక్స్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిబిరం కొనసాగుతుంది. ఈ సందర్భంగా స్పెషలిస్ట్ కన్సల్టేషన్, కంప్లీట్ బ్లడ్ పిక్చర్ (సీబీపీ), ర్యాండమ్ బ్లడ్ షుగర్ (ఆర్‌బీఎస్), ఈసీజీ, బ్లడ్ ప్రెషర్(బీపీ), బాడీ మాస్ ఇండెక్స్(బీఎంఐ) వంటి పరీక్షలను కూడా నిర్వహిస్తారు. న్యూరాలజీ, పిడియాట్రిక్స్, సైకియాట్రీ వైద్యాధికారి డాక్టర్ జి అనంత్‌రెడ్డి పర్యవేక్షణలో ఈ శిబిరం నిర్వహిస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 9160884461లో సంప్రదించాలి.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో శుక్రవారం సుమధుర ఆర్ట్స్ అకాడమీ శ్రావ్య మానస శిష్యబృందంచే కూచిపూడి, జానపద నృత్యప్రదర్శనలను నిర్వహించి సందర్శకులను అలరించారు. నారాయణ అచ్యుత, అన్నమయ్య సంకీర్తనలు, శ్రీవిఘ్నరాజంభజే, దశావతారం, శివాష్టకం, ధనశ్రీ, తిల్లాన తదితర అంశాలను కళాకారులు అమూల్య, స్పందన, సాహితి, లీక్షిత, శాన్వి, తన్వి, శివ, ప్రణీత ప్రదర్శించారు.